కథ

# కుచ్ కుచ్ హోతా హై

లక్ష్మి

అతను అస్థిమితంగా కదిలాడు.

కంటి మీద కునుకు రావట్లేదు.

రెప్ప వాల్చటం మర్చిపోయి ఎన్నో ఏళ్లయినట్టుగా వుంది!

నిశ్శబ్ద నిశీధిలో రాత్రి మెల్లగా కరిగిపోతోంది!

చలిగాలి రివ్వున వీస్తోన్నా... అలసి సొలసిన అతని శరీరానికి నిదురమ్మ చేరువ కావని మారాం చేస్తోంది!!

పక్కకు తిరిగి చూశాడు. భార్య గాఢ నిద్రలో వుంది.

అతనికి మనసంతా చికాగ్గా, భారంగా ఇదీ అని చెప్పకోలేని అయోమయావస్థలో వుంది!!

'బ్లడీహెల్' తనను తానే తిట్టుకున్నాడు.

మనసంతా 'ఆమె' ఆవరించిపోగా... ఏండెల్లో బలంగా ముద్రించుకు పోయిన ఆ రూపం... ఆ మాట తీరు... ఆ కట్టూ–బొట్టూ... అతన్ని నిలువ నీయటం లేదు.

లేచి టైము చూశాడు. రాత్రి పదిన్నర! ఈ సమయంలో ఆమె ఏం చేస్తూ వుంటుంది? భర్తను అల్లుకుపోయి మెడ ఒంపులో తల దాచుకొని నిద్రిస్తూ వుంటుంది. అంతేనా "లేక... లేక... భర్తతో"... ఛ! ఛ! ఆపైన వూహించలేకపోయాడు. ఒక్కసారి ఫోన్ చేస్తే... ఆ... చేస్తే... ఏమనుకుంటుందో...?

ఓ డాక్టర్‌గా ఫోన్ చేస్తాడు... దట్సాల్!? ఆమె కంఠం వినాలన్న ఆశను అణుచుకోలేక–

గబగబా పర్సనల్ డైరీ వెతికి– రింగ్ చేశాడు.

ఒకటి– రెండు– మూడు– నాలుగు రింగుల అనంతరం "హల్లో" నిద్ర మత్తు విడి వీడని ఆ స్వరం గమ్మత్తుగా అతని చెవులను ముందు తాకి... అనంతరం హృదయాన్ని మీటింది.

"నేను డెంటిస్ట్‌ని మాట్లాడుతున్నాను. ఉదయం మీకు ఆర్.సి. ట్రీట్‌మెంట్ తరువాత మెడిసిన్స్ ప్రిస్క్రయిబ్ చేయటం మరిచాను. పెయిన్‌గా వుంటే 'నైస్' టాబ్లెట్స్ రోజుకు రెండు చొప్పన వేసుకోండి" అన్నాడు.

అటువైపు చిన్నగా నవ్వు... అది తెరలు తెరలుగా అతని గుండె 'లయ' తప్పిస్తూ...

"థ్యాంక్స్ డాక్టర్!! నొప్పి లేదు. అయినా మీ 'మందు' గుర్తుంచుకుంటాను" అంటూ అతని రిప్లయ్‌కై ఎదురు చూసేసరికి–

ఏం మాట్లాడాలో ఎలా ప్రొసీడవ్వాలో తెలీని అతను "ఒకె! గుడ్‌నైట్!" అని ఫోన్ పెట్టేశాడు.

"డామిట్! ఒక్క అడుగు ముందుకు వేయటం తెలీదు" మళ్లీ తనని తానే నిందించుకుంటూ–

ఆ రోజు వుదయం జరిగిన సంఘటన లోకి వెళ్ళిపోతూ...

* * * * *

"మే... అయ్... కమిన్ డాక్టర్!" కర్టెన్ తొలగించుకుని ఓ స్వరం వినిపించేసరికి–

అతను తలెత్తి చూశాడు–

మబ్బుల్లోంచి ఓ తేనె మేఘం మెరువు తీగలా కదిలి ముందు ప్రత్యక్షమయ్యేసరికి–

అతనికి గుటక పడటం కష్టమైపోయింది.

రెప్ప వాల్చటం మర్చిన ఆ కళ్ళు 'ఆమె' యిబ్బందిగా కదిలేసరికి సభ్యతను తిరిగి తెచ్చుకుంటూ...

"ఎస్!" అన్నాడు.

"ఓ దంతానికి 'కేవటీ' ఏర్పడింది. దానికి మీ ట్రీట్‌మెంట్..." అంటూ ఆగింది.

డెంటల్ ఛెయిర్లో ఆమెని కూర్చోమని అతను ముందుకు వంగాడు పరీక్షించటానికి...

వృత్తి ధర్మం ఆమె దంతాల్ని పరీక్షిస్తోంటే... మనసు ఆమెనే నిశితంగా చూస్తూ...

ఫ్రెష్‌గా షాంపూ చేసి గాలికి వదిలేసిన కురులు...

ఒంటిపై నుండి తేలి వస్తోన్న సన్నని ఫ్రెంచ్ పరిమళం...

ముందుకు వంగినప్పుడు మెత్తగా తాకుతోన్న ఆమె భుజం...

పైట కొంచెంగా చెదరి– ఆరోగ్యంగా అర్ధ భాగమే కన్పిస్తోన్న వక్షం... తెల్లగా ముద్దొస్తున్న ఆ పొట్ట...

గుడ్ గాడ్... అతన్ని మొదటిసారిగా మైకంలో పడేశాయి. యాంత్రికంగా 'రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్‌కై' దంతాన్ని ఓపెన్ చేసి ట్రీట్‌మెంట్ చేస్తోన్నా... అతన్లో 'అలజడి' మొదలైపోయింది!

"మళ్లీ నెక్స్‌ట్ వీక్ రండి!" అతను అనేసరికి–

"డాక్టర్! మాకు మెడికల్ రీ ఎంబర్స్‌మెంట్ ఉండదు. కొంచెం మీరు ఫీజ్ కన్సెషన్ యిస్తే..." అని అర్థోక్తిగా ఆమె ఆగిపోయేసరికి–

అతను విల విల్లాడి పోయాడు! 'డబ్బు' విషయం ఆమె కదిపేసరికి! ఇతర పేషంట్స్ దగ్గర గోళ్ళూడగొట్టి ఖచ్చితంగా మరీ ఫీజు వసూల్ చేసే అతను–

ఆమె ముందు మూగబోయి "ఇట్స్ ఓ.కె.! ముందు మీ ట్రీట్‌మెంట్ కానివ్వండి!" అని నవ్వేశాడు.

ఆమె వెళ్ళిపోతోంటే ఎవరో ఆత్మీయులు దూరమై పోతున్న భావన... ఏదో పెన్నిధికి పోగొట్టుకున్న ఫీలింగ్ అతన్లో...

* * * * *

అరచేతిలో చిన్న ప్లాస్టర్‌తో వచ్చిన ఆమెను

చూసేసరికి అతను కంగారు పడిపోయి ఆమె చేతిని చప్పున అందివుచ్చుకుని "ఏమైంది?" ఆతృతగా అడిగాడు.

"వంట చేస్తోంటే కుక్కర్ కాలింది!" అని ఆమె చెబుతూ...

"డాక్టర్ మీరు నా చేయిని వదల్లేదు!" అందంగా సిగ్గు పడేసరికి "ఓ... అయాం సారీ!" అంటూ ఆతనూ సిగ్గుపడిపోయాడు ఆ చేతిని అయిష్టంగా వదిలివేస్తూ...

"ఇవాల్టితో నా ట్రీట్‌మెంట్ అయిపోయిందాండీ!" అమాయకంగా ఆమె ప్రశ్నించేసరికి-

అతను కళ్ల నీళ్ల పర్యంతమై పోతూ... ఎమోషన్స్‌ని బలవంతంగా అణచుకుంటూ...

"ఫైనల్ చెకప్‌కి ఓ రెండ్రోజుల తరువాత 'కలవండి'!

అని కళ్లెత్తి ఆమె వంక సూటిగా చూశాడు.

అప్పటి వరకూ అతన్నే నిశితంగా గమనిస్తోన్న ఆమె చురుక్కుమనిపించే ఆ చూపుల ధాటికి రెప్పలు కిందికి వాల్చేస్తూ మెల్లగా కదిలి వెళ్లిపోయింది!

"నో! నో! డోంట్ గో! ప్లీజ్! అయ్ లవ్ యూ డియర్!!

అయ్ రియల్లీ లవ్ యూ! అయ్ లవ్ యూ!! నాకు నువ్వు కావాలి! ఆ నవ్వు నా సొంతం కావాలి! వెళ్లొద్దు! ప్రియతమా! వెళ్లకు! ప్లీజ్!" అతని గుండె గొంతుకలోనే ఆగిపోయి...

కళ్లలో నీటి చుక్కలై బయటకొస్తోంటే...

"సిస్టర్! ఈ రోజింక పేషంట్స్‌ని చూడను! పంపించేయ్!" అని వడివడిగా బయటకొచ్చి చూశాడు!

ఆమె కనిపించలేదు!

* * * * *

నిరాశగా... డల్‌గా... యింటికొచ్చిన అతనికి ఫోన్ రింగవుతోన్న శబ్దం చిర్రెత్తింది.

"హల్లో" కటువుగా అన్నాడు!!

"డాక్టర్! నేను..." అట్నుండి ఆమె...

"ఎస్! ఎస్! చెప్పండి!" కొత్త శక్తి అతన్లో ప్రవేశిస్తో...

"రేవు మీరు మా యింటికి లంచ్‌కి వస్తారా? మీకేం 'యిబ్బంది' వుండదు! పిల్లలు, శ్రీవారు ఈరోజు మా అత్తగారి వూరు వెళుతున్నారు. నేనొక్కదాన్నే! అదీ... మీకు అభ్యంతరం లేకపోతే..." ఆమె అనేసరికి-

అనుకోని- ఎదురుచూడని 'ఆ ఆహ్వానం' అతన్ని ఆనందం చుట్టు ముట్టేయగా... మళ్లీ ఎక్కడ ఆమె మనసు మార్చుకుంటుందో అన్న కంగారులో "ష్యూర్! ష్యూర్!" అంటూ ఆమె అడ్రస్ నోట్ చేసుకుని-

"థ్యాంక్ గాడ్! షీ లైక్స్ మీ!" హుషారుగా ఈల వేశాడు!

మరిక ఆ రాత్రి అతనికి నిద్ర పట్లేదు!!

కుచ్... కుచ్... హోతాహై... !!!

* * * * *


మొదటిసారి-

అవుట్‌సైడ్ ది మ్యారేజ్...

ఓ యిల్లీగల్ ఎఫయిర్...

అతని మనసు- వయసు- ఆకాశం అంచుల్లో తేలి పోతోంటే... చేతిలో ఓ 'రెడ్‌రోజ్ బొకే' తో ఆమె యింటి ముందు






వాలిపోతూ...

సున్నితంగా డోర్ బెల్ నొక్కాడు.

తలుపు తీస్తూనే 'నవ్వుతూ' ఇన్వైట్ చేస్తూ "హాయ్! డాక్టర్! రండి!" అందామె!

అప్పుడే స్నానించి- పూజ ముగించిన గుర్తుగా బొట్టు కింద దేవుడి కుంకుమ హోలీనెస్‌ని స్ఫురణకు తెస్తో...

ఆమె అందం అతన్ని మూగవాడ్ని చేసేసరికి- మౌనంగా ఫ్లవర్ బొకే అందించాడు!

"రండి! భోం చేస్తూ మాట్లాడుకుందాం!" డైనింగ్ హాల్లోకి దారి తీసిందామె.

అతని కంచంలో రైస్ వడ్డిస్తూ... తనూ ఓ ప్లేట్ తీసుకుని అతని ఎదురుగా కూర్చుందామె!

"మీరేమీ అనుకోనంటే ఓ 'విషయం' చెబుతాను"! అని ఆమె అంటోంటే- అతని గుండె వేగంగా కొట్టుకుంటోంది.


"డాక్టర్! పవిత్రమైన వైద్య వృత్తిలో మీరున్నారు. ఏదైనా- ఎట్లా అయితేనేమిటి? మీరు నన్ను యిష్ట పడ్డారు! వాంఛిస్తున్నారు! అది ప్రస్తుతానికి నిజమైన 'లవ్' కావచ్చు! 'లవ్ లీడ్స్ టూ లస్ట్!' అక్రమ సంబంధం ఎప్పుడూ అక్రమ మార్గంలోనే సాగుతుంది. ఓ అయిదారు 'కలయికల' తరువాత 'బోర్' కొట్టనూవచ్చు లేదా 'యింకా' 'కావాలి' అని అనిపించవచ్చు! బట్ ఎన్నాళ్లు! ఇదీ కొన్నాళ్లకి యాంత్రికమైపోతుంది! ఆ తరువాత మళ్లీ బోర్- బోర్" మనసు స్పందించడం సహజం! కానీ దాన్ని అదుపులో వుంచుకుని ఆకర్షణని జయించటం గొప్పతనం! నా భర్తంటే నాకెంతో యిష్టం! నా చిన్న సంసారమే నా ప్రపంచం! నేను గీత దాటలేను. మీ చేయి అందుకోలేను! అందుకోను! హైందవ స్త్రీని నేను! మీరూ దయచేసి అలానే ఆలోచిస్తే యిద్దరికీ మంచిదని భావిస్తున్నాను" సూటిగా అతని కళ్లలోకి చూస్తూ స్పష్టంగా తన అభిప్రాయాన్ని వెలువరించింది ఆమె. అంతే! అతని కళ్లకు కమ్మిన తెరలు తొలగిపోయాయి! మనసుని ఆవరించిన మబ్బులు వీడిపోయాయి! ఇప్పుడతనికి ఆమె ఓ స్త్రీ! మరొకరి భార్య! గృహిణి! అంతే! అది దాటి అతని దృష్టి పోనంటుంది. సభ్యత, సంస్కారం అతన్లో నిండిపోగా- "థ్యాంక్యూ సో మచ్!" మనస్ఫూర్తిగా అన్నాడు!

తేలిక పడ్డ గుండెతో అతను ఆ యింటి నుండి వెళ్లగా- చిత్రంగా- ఆమె మాత్రం భారంగా నిట్టూర్చింది.

* * * * *

## బరువు తగ్గేందుకు జ్యూస్ తాగాలి

భోజనానికి 40 నిముషాల ముందుగా ఓ గ్లాసు పళ్లరసం తాగితే బరువు తగ్గే అవకాశం ఉంటుందంటున్నారు డాక్టర్లు. ఆకలి



గణనీయంగా తగ్గించే శక్తి ఈ పళ్ల రసంలో ఉంటుంది. పైగా జ్యూస్‌లో వుండే సహజమైన గ్లూకోజ్ కూడా శరీరానికి అందుతుంది. బరువు పెంచే పదార్థాలు ఏవీ ఫ్రూట్‌జ్యూస్‌లో లేవు. పైగా ఎలాటి కృత్రిమమైన రుచి లేని సహజమైన పళ్లరసం ఆరోగ్యకరం కూడా!

## చీర

రాత్రి వేళ
ఊరిస్తూ...జారుతూ
శృంగారం వొలికిస్తుంది
తెల్లార గట్ట
అస్తవ్యస్తంగా వొంటికి చుట్టుకున్నప్పుడు
హాస్యాన్ని చిలికిస్తుంది!
పుట్టింటి వాళ్ల దగ్గర్నుంచి
కబురొస్తే చాలు
కళ్లొత్తుకుంటూ....
కొంగంతా కరుణ రసం
వర్షిస్తుంది!!
నీళ్ల టాంకర్ వీధిలో
కొస్తే...బిందెకి సపోర్టింగా
నడుము మీదికి చెక్కేసీ
వీర రసాన్ని ప్రదర్శిస్తుంది!!
పని మనిషి 'నాగా' పెడ్తే
బొడ్డులోకి దోపి
అంట్ల మీద రౌద్రాన్ని ప్రదర్శిస్తుంది
మొగుడితో గొడవ పడ్డ రోజున
నేల మీద చెంగై!! పరుచుకునీ!
భయానకాన్ని...రుచి చూపిస్తుంది!
అకారణంగా పతి దేవుడు
తిట్టాడో...దూలానికి వేల్లాడుతూ
బీభత్సాన్ని...సృష్టిస్తుంది!
పొరపాటైందే..అని బేలగా
భర్త కన్నీరు పెట్టాడా!!
అంచుతో తుడుస్తూ
అద్భుతాన్ని ఆవిష్కరిస్తుంది!!
రాజీ కొస్తే చాలు
మల్లె వంటి తెల్లని ఉల్లిపొరై
శాంత రసాన్ని...ప్రసాదిస్తుంది!
ఆరంభంలో మన్మధుడి
కోట బురుజు పైన భావోద్వేగంలో
రెప రెప లాడే పతాకం లాంటి చీర!
పది నెల్లు తిరిగేసరికి
పండంటి పాపాయిని
గుండెలో పెట్టుకునీ
మాతృ గర్వంతో ఊగిపోతూ
ఉయ్యాలై పోతుంది!!

-తనికెళ్ళ భరణి